వంటింట మంచి మాట

- ప్రభుత్వ రాయితీపై టమాటాలు
- రైతు బజార్‌లో కిలో రూ.50
- బయట మార్కెట్‌లో రూ.120



గాంధీనగర్ రైతు బజార్‌లో క్యూలో ఉండి రాయితీ టమాటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

బోట్‌క్లబ్: టమాటా లేనిదే ఇంట్లో ఏ కూరా వండలేని పరిస్థితి.. అలాంటి టమాటాకు ప్రస్తుతం యమా డిమాండ్ వచ్చింది. మార్చి నుంచి జూన్ నెల వరకూ కాసిన ఎండలకు టమాటా పంట ఎండిపోవడంతో దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో ప్రస్తుతం మంచి గిరాకీ ఏర్పడింది. బయట మార్కెట్‌లో కిలో టమాటా రూ. 120కి పైగా విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం రాయితీపై టమాటాలు విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్ వద్ద రైతు బజార్‌లలో సబ్సిడీపై టమాటాలు అందిస్తుంది. ఈ రెండు రైతు బజార్‌లలో టమాటాల కోసం వినియోగదారులు క్యూ కడుతున్నారు. మామూలు రోజుల్లో కాకినాడలోని రెండు రైతు బజార్‌లకు సుమారు ఐదు టన్నులకు పైగా టమాటాలు వచ్చేవి. దిగుబడి భారీగా తగ్గిపోవడంతో రైతు బజార్‌కు ప్రస్తుతం ఐదు క్వింటాళ్ల మించి రావడం లేదు. దీనికితోడు బయట మార్కెట్‌లో ధరకు రెక్కలు రావడంతో కేవలం టమాటాల కోసం రైతు బజార్‌కు వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో క్యూలో నిలబడి మరీ కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు.

మదనపల్లి నుంచి తీసుకొచ్చి..

టమాటా ధరలు పెరగడంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. స్థానికంగా టమాటాలు అందుబాటులో లేకపోవడంతో మదనపల్లి మార్కెట్ నుంచి తీసుకొచ్చి సబ్సిడీపై వినియోగదారులకు అందిస్తుంది. కిలో టమాటా రూ. 50కు విక్రయిస్తుంది. బయట మార్కెట్‌లో కిలో రూ.120కి పైబడి అమ్ముతున్నారు. వీధివీధినా తిరిగి కూరగాయలు విక్రయించే వ్యాపారులైతే కిలో రూ.140కి పైగా అమ్ముతున్నారు. దీంతో రైతు బజార్‌లో టమాటాలు కొనుగోలు చేసుకొనేందుకు ప్రజలు అధికంగా వస్తున్నారు.

ప్రజలకు ఊరట

సాధారణ, మధ్య తరగతి ప్రజలు టమాటా కొనుగోలు చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. కిలో బయట కొనుగోలు చేయాలంటే రూ. 120 ఖర్చు చేయాల్సి రావడంతో ఆందోళన చెందారు. సాధారణ, మధ్య తరగతి ప్రజలకు భారం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం సబ్సిడీపై రైతుబజార్‌లో టమాటాలు విక్రయిస్తుంది. రైతుబజార్‌కు వచ్చే ప్రతి వినియోగదారునికి రోజుకు కిలో టమాటాలు అందిస్తున్నారు. ఇవి పక్కదారి పట్టకుండా ఆధార్‌కార్డు నంబర్ నమోదు చేసుకుని ఇస్తున్నారు.

కష్టం తెలుసుకుని..



గతంలో టమాటా, ఉల్లిపాయలు వంటి ధరలు పెరిగినా రాయితీలపై అందించిన దాఖలాలు లేవు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇబ్బందులు తెలుసుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. సబ్సిడీపై టమాటాలు అందిస్తున్నారు. నిజంగా ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

–పంగ సుబ్బలక్ష్మి, గృహిణి

ప్రజల బాధలు చూసి..



ఏ కూర వండుదామన్నా టమాటా అవసరం ఉంటుంది. కానీ ధర భారీగా పెరగడంతో తప్పని పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో అర కేజీ రూ. 60 పెట్టి కొనుగోలు చేసుకున్నాం. ప్రజల బాధలు చూసి ప్రభుత్వం రైతుబజార్‌లో కిలో టమాటా రూ.50 విక్రయించడం ఆనందదాయకం.

–ఉష, గృహిణి

భగ్గుమన్న వలంటీర్లు

- పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై నిరసన
- ర్యాలీలు, దిష్టిబొమ్మల దహనం

కాకినాడ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తీరుపై నగరంలోని వలంటీర్లు భగ్గుమన్నారు. పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ కాకినాడలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక జగన్నాథపురం, డైరీ ఫారం సెంటర్‌లలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా పవన్ వ్యాఖ్యలు విన్న వలంటీర్లు ఆగ్రహంతో రగిలిపోయారు. స్వచ్ఛందంగా నిరసనలకు పిలుపునిచ్చారు. పవన్ కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొని అతని చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు గెద్దం అజయ్ కుమార్, బండి నాగరత్నం, ఐ.శ్రీను మాట్లాడుతూ సేవాభావంతో పనిచేస్తోన్న వలంటీర్లను కించపరిచేలా పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తమను ఎంతగానో బాధించాయన్నారు. ప్రతి కుటుంబంలో ఒక సభ్యుడిలా వలంటీర్లు మమేకమై ప్రభుత్వ పథకాలు అమలులో ఎంతో పారదర్శకంగా పనిచేస్తోంటే, తమను కించపరిచేలా మాట్లాడడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. తమ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన పవన్‌కల్యాణ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

రూరల్ వలంటీర్ల ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ సంక్షేమ పథకాలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్న వలంటీర్ల పట్ల జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు చేయడంపై నిరసనలు వెల్లువెత్తాయి. పవన్ బేషరతుగా వలంటీర్లకు క్షమాపణ చెప్పాలంటూ ఆందోళనలు చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వలంటీర్లు భారీ ఎత్తున సర్పవరం జంక్షన్‌కు ర్యాలీగా చేరుకుని పవన్‌కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఒకటో తేదీనే ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌ను లబ్ధిదారులు ఇంటివద్ద ఉన్నా, ఆస్పత్రిలో ఉన్నా అందజేయడమే కాకుండా పథకాల కోసం తోడ్పాటు ఇస్తుండగా తమపై పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని ముక్తకంఠంతో ఖండించారు. వలంటీర్లు నవ్య, రాకేష్, మహేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఇది సినిమా కాదు సమాజం



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: నోటికొచ్చినట్టు మాట్లాడడానికి ఇది సినిమా కాదని సమాజమని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ గుర్తెరగాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉభయగోదావరి జిల్లాల మహిళా విభాగం రీజినల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కరోనా సమయంలో వలంటీర్లు తమ కుటుంబాలు, ప్రాణాలనూ లెక్కచేయకుండా బాధితులకు మందులు, ఆహారాన్ని అందించి ఆదుకున్నారన్నారు. రాష్ట్రంలో కరోనాను తరిమికొట్టడంలో, రోగులను ఆదుకుని వారి ప్రాణాలు నిలపడంలో వలంటీర్లు చేసిన సేవలు అమోఘమని కేంద్రం కూడా అంగీకరించిందన్నారు. వలంటీర్ వ్యవస్థలో లోపాలు ఉంటే ప్రతిపక్షంగా వివరించాలని, అంతేతప్ప వలంటీర్లను నిందించడం ఎంత మాత్రం సబబు కాదన్నారు. మీ కుటుంబంలోనూ మహిళలు ఉన్నారని గుర్తుంచుకోవాన్నారు. ముఖ్యమంత్రిని, వారి కుటుంబాన్ని దుర్భాషలాడడం సరికాదన్నారు. వలంటీర్లను క్రిమినల్స్‌గా చూపించడం పవన్ చేతకానితనానికి నిదర్శనమన్నారు.



పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ చేస్తున్న వలంటీర్లు



పవన్‌కల్యాణ్ చిత్రపటానికి నిప్పుపెడుతున్న వలంటీర్లు



సర్పవరం జంక్షన్‌లో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

రైజ్ సేవలకు అరుదైన గౌరవం



రైజ్ జిల్లా కోర్సు కోఆర్డినేటర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైజ్ (రెడీనెస్ ఇనీషియేటివ్ ఫర్ సిచువేషనల్ ఇంగ్లిష్) ద్వారా జిల్లా కోర్సు కోఆర్డినేటర్‌గా జీవీ ప్రసాద్ అందిస్తున్న సేవలకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో కళామందిర్ ఫౌండేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన ఉత్సవంలో సేవా రత్న అవార్డులను ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తూ పెద్దగా గుర్తింపునకు నోచుకోలేని అన్ సీన్ హీరోస్‌ను ఐదుగురిని కళామందిర్ ఫౌండేషన్ సేవారత్న అవార్డులకు ప్రకటించింది. ఇందులో పేద తెలుగు విద్యార్థులకు అమెరికా తరహా ఇంగ్లిషు విద్యను అందిస్తున్న రైజ్ జిల్లా కోర్సు కోఆర్డినేటర్, పి.దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బెండపూడి ప్రసాద్‌ను ఎంపిక చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రసాద్‌ను సత్కరించి మెమెంటో, రూ. 50 వేల నగదుతో సత్కరించింది. సోమవారం కలెక్టరేట్‌లో ప్రసాద్‌ను కలెక్టర్ కృతికా శుక్లా, డీఈఓ అన్నపూర్ణ అభినందించారు.

వేద స్మార్త పరీక్షలకు స్పందన



వేద పరీక్షలు జరుపుతున్న నిర్వాహకులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడ వేదవిజ్ఞాన ప్రతిష్టానం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వేద స్మార్త పరీక్షలకు అనూహ్య స్పందన వచ్చింది. దీనికి వివిధ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారని ప్రతిష్టానం కార్యదర్శి రాయప్రోలు ప్రసాదశర్మ తెలిపారు. ప్రముఖ ఘనాపాఠి శ్రీపాద రాజశేఖరశర్మ మాట్లాడుతూ దివంగత జ్యోతిష పండితుడు చెరుకుపల్లి లక్ష్మీనృశింహశర్మ 2009లో నుంచి ఈ పరీక్షలు ప్రారంభించారని, అప్పటి నుంచి ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారన్నారు. వేద, స్మార్త రంగాల్లో నిష్ణాతులను తయారు చేయడమే ప్రతిష్టానం ప్రధాన లక్ష్యమన్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి దేశ విదేశాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. శుక్ల, కృష్ణ యజుర్వేదాలు క్రమాంతం, రుగ్వేదం క్రమాంతం, సామవేదం తదితర వాటిల్లో పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల్లో ఆయా విద్యార్థుల ప్రతిభను, వేద మంత్రాలను పఠించడం పరిశీలించామన్నారు. కపిలవాయి రామశాస్త్రి, దువ్వూరి ఫణి ఘనాపాటి, చింతా చలపతిశర్మ, హరిగోపాలశర్మ, పరీక్షల అధికారులుగా ఆకొండి శివ, అరిపిరాళ్ల పురుషోత్తమ శర్మ, మహంకాళీ దత్తాత్రేయశర్మ, కొలచెన శాస్త్రి వ్యవహరించారు.

క్రమశిక్షణతో విద్యనందించాలి



కరప గురుకుల పాఠశాలలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కరప: గురుకుల పాఠశాలను పరిశుభ్రంగా ఉంచి, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని సోమవారం ఆయన ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మితో కలసి పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అప్పుడప్పుడూ వస్తుండటంతో గురుకుల విద్యాలయం నిర్వహణ బాగుండడం లేదని, విద్యార్థులతో పనులు చేయిస్తున్నారని, విద్యార్థులను చేర్పించుకునేందుకు ఖాళీలున్నా, లేవని చెబుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తుండటంతో తనిఖీకి వచ్చినట్టు జెడ్పీటీసీ, ఎంపీపీ తెలిపారు. విధులలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఇక్కడ పరిస్థితిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకెళ్లి, పూర్తిస్థాయిలో ప్రిన్సిపాల్‌ను నియమించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వంటశాలకెళ్లి మెనూ ప్రకారం వంటలు చేస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శం

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి



జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తున్నాయని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక 17వ డివిజన్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన సోమవారం సందర్శించారు. డివిజన్‌లోని లబ్ధిదారులకు మంజూరైన సర్టిఫికెట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాల కోసం ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రజల ఇబ్బందులను గమనించిన సీఎం జగన్ జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి అవసరమైన జనన మరణ, వివాహ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 11 రకాల సేవలను అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. దీనిద్వారా ప్రజలు ఇంటి వద్ద నుంచే ప్రభుత్వ సేవలు పొందే అవకాశం లభించిందన్నారు. ఎన్నుకున్న ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతోనే సీఎం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంచుకున్నారన్నారు. సర్టిఫికెట్ల జారీతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి మంజూరు చేస్తున్నారన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బొర్రా రమణ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు



వేళంగిలో గర్భిణులకు జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్లు సౌజన్య, సింధూర

కరప: ప్రతి నెలా గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ, వైద్యుల సలహా మేరకు పోషకాహారం తీసుకోవాలని డివిజనల్ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్‌నాయక్ సూచించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్షా అభియాన్‌లో భాగంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు ఆయన వైద్య పరీక్షలు చేశారు. కరప పీహెచ్‌సీ పరిధిలోని 11 ఆరోగ్య ఉపకేంద్రాల ఏఎన్ఎమ్‌లు గర్భిణీలను పీహెచ్‌సీకి తీసుకు వచ్చారు. అనంతరం పలు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ టెస్టులు చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ ఆశ, సీహెచ్‌ఓ వై.రత్నకుమారి, టీబీటీ సుందరి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. వేళంగి పీహెచ్‌సీ పరిధిలోని ఏడు ఆరోగ్య ఉపకేంద్రాల్లో 24 మంది గర్భిణులకు డాక్టర్లు ఎంకే.సౌజన్య, సి.సింధూర వైద్య పరీక్షలు చేశారు. 9 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు చేశారు.

కాల్షియం లోపిస్తే కీళ్ల సమస్యలు

కాకినాడ రూరల్: ఎముకల్లో కాల్షియం తగ్గడంతో కీళ్ల వ్యాధులు ఇచ్చే అవకాశం ఉందని డాక్టర్ సువర్ణ రాజు తెలిపారు. సర్పవరం జంక్షన్‌లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించాలంటే సాత్వికాహారమే మేలన్నారు. అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హుండీల ఆదాయం లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను సోమవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 102 రోజుల కాలానికి రూ.11.09 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎస్.సత్యవాణి తెలిపారు. ఈ లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

35వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న బొల్లంరెడ్డి రాంబాబు

కరప: స్థానిక వాసి బొల్లంరెడ్డి రాంబాబు 35వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. కాకినాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సీహెచ్ సత్యవతికి గుండె ఆపరేషన్ నిమిత్తం రక్తం అత్యవసరంగా కావాల్సి వచ్చింది. ఆసుపత్రి వైద్యులు ఈ విషయమై ఎమర్జెన్సీ బ్లడ్‌గ్రూప్స్ ఫౌండర్ రామకృష్ణకు చెప్పగా, ఆయన కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలును సంప్రదించారు. తాతీలు స్పందించి తన మిత్రుడు బొల్లంరెడ్డి రాంబాబును చైతన్యపరచి కాకినాడలోని రెడ్‌క్రాస్ సంస్థకు పంపించగా అక్కడ 35వ సారి రక్తదానం చేశారు. ఆయన్ని పలువురు అభినందించారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: తప్పులు లేని ఓటర్ల జాబితా లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల తెలిపారు. దీనిపై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజరీ అధికారులతో సమీక్షించారు. ఒకే డోర్ నంబర్‌లో పదికన్నా ఎక్కువ ఓటర్లు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లోపాలను సరిచేసి పారదర్శక ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, తహసీల్దార్ సీతాపతిరావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, సర్వేయర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



స్పందనలో ప్రజల సమస్యలు వింటున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా డయల్ యువర్ కమిషనర్‌లో వచ్చే ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపుతామని ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఫోన్ ద్వారా వచ్చిన సమస్యలను విని సత్వర పరిష్కారానికి ఆయన ఆదేశాలు ఇచ్చారు. ఎస్ఈ పి.సత్యకుమారి, ఈఈ వెంకట్రావు, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 14 వినతులు వచ్చాయని ఏడీసీ తెలిపారు.

అంగన్‌వాడీల ధర్నా

కాకినాడ సిటీ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. పలువురు నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వాలని ఆందోళన

కాకినాడ సిటీ: తమ సాగులోని భూములకు పట్టాలు ఇవ్వాలని గుర్రంపాలెం సీలింగ్ భూముల సాగుదారులు సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. జగ్గంపేట మండలం గుర్రంపాలెం పరిధిలో భూమిని ఎస్సీ, బీసీ కులాల్లోని 20 పేద కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయన్నారు. నాలుగు ఎకరాల భూమికి పెత్తనందార్లు రికార్డులు సృష్టించి స్వాధీనం చేసుకున్నారన్నారు. తహసీల్దార్ అండతో ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి అందజేశారు. ఏపీ ఆర్‌సీఎస్ డివిజన్ నాయకులు వల్లూరి సత్తిబాబు, మడికి సత్యం, కుంచే అంజిబాబు పాల్గొన్నారు.

'థింక్' నాటికకు ఉత్తమ అవార్డు



మంజునాథకు ప్రథమ బహుమతి అందజేస్తున్న పరిషత్ అధ్యక్షుడు అచ్యుత రామారెడ్డి

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళా మందిర్‌లో అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు సోమవారంతో ముగిశాయి. ఇందులో ఉత్తమ ప్రదర్శనగా సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) సమర్పణలో ప్రదర్శించిన 'థింక్' నాటిక ఎంపికైంది. ద్వితీయ ప్రదర్శనగా చైతన్యకళా భారతి (కరీంనగర్) సమర్పణలో ప్రదర్శించిన 'ఖరీదైన జైళ్లు', తృతీయ ప్రదర్శనగా అరవింద్ ఆర్ట్స్ (తాడేపల్లి) సమర్పణలో ప్రదర్శించిన 'మనస్విని' నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ దర్శకుడిగా మంజునాథ్ (థింక్ నాటిక), ఉత్తమ నటుడిగా థింక్ నాటికలో సంతోష్ పాత్రధారి సంతోష్ కుమార్, ఉత్తమ నటిగా మనస్విని నాటికలో పాత్రధారి బి.నామమణి ఎంపికయ్యారు. వీరికి పరిషత్ గౌరవ అధ్యక్షులు కర్రి బామిరెడ్డి బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

నాట్యజ్యోతి పురస్కారాల ప్రదానం



నాట్యజ్యోతి పురస్కారాలు పొందిన బాలాత్రిపుర సుందరీ నృత్యనికేతన్ విద్యార్థినులు

కాకినాడ కల్చరల్: స్థానిక శ్రీబాలా త్రిపుర సుందరీ నృత్యనికేతన్ విద్యార్థినులకు నాట్యజ్యోతి పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. మయూరి నృత్యాలయం సంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో గురువందనం పేరుతో నృత్యోత్సవం సోమవారం నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి నృత్యనికేతన్ విద్యార్థినులు అక్షయ భావన, జాహ్నవి, దేవకి, సంగీత తదితరులు భామాకలాపం, శ్రీకృష్ణలీలలు, శ్రీనివాస కల్యాణం తదితర నృత్య ప్రదర్శనలు ఇచ్చి అలరించారు. వీరికి సంస్థ 'నాట్యజ్యోతి' పురస్కారాలు ప్రదానం చేసింది. నృత్యనికేతన్ నాట్యాచార్య బేతా సత్యనారాయణను 'నాట్యభారతి' పురస్కారంతో సత్కరించారు. నగర ప్రముఖులు ఆయనను, విద్యార్థినులను అభినందించారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు



వేళంగిలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు, నాయకులు

కరప: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు అన్నారు. వేళంగి సచివాలయం-1లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సవిలే నీలిమ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనంతరం 1,081 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అధికారులు, నాయకులు ఉచితంగా అందజేశారు. ఉప సర్పంచ్ కుంచే అయ్యన్న, ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి మంగయ్యమ్మ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, నాయకులు పెంకే సత్తిబాబు, సవిలే రాజేష్, జీలకర్ర దుర్గారావు, గరగ జెమ్మీ, సానా శ్రీను పాల్గొన్నారు.

ముద్దాయికి రిమాండ్

సామర్లకోట: జట్టు మేస్త్రి మృతికి కారణమైన ఆసి జగ్గయ్యకు 21 వరకూ రిమాండ్ విధించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. జి.మేడపాడు శివారులోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో వెల్డింగ్ పని చేయడానికి వచ్చిన ఏడుగురు ఒడిశాకు చెందిన కార్మికులు జి.మేడపాడులో నివాసముంటున్నారు. వారికి గేదెల సారథి జట్టు మేస్త్రిగా ఉండేవాడు. 3వ తేదీ రాత్రి జరిగిన ఘర్షణలో సారథిని ఆసి జగ్గయ్య వెనక్కి నెట్టేయడంతో సారథి కింద పడి తలకు బలమైన గాయమైంది. కాకినాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సారథి మృతి చెందాడు. జగ్గయ్యను సోమవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.